క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలో 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నెహ్రూనగర్, వెంకట్రామ్‌నగర్, ఆదర్శనగర్, సాయినగర్, సుభాష్‌నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'నాసిరకంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు'


పగిలిన అద్దాలను చూపిస్తున్న నాయకులు

గంభీరావుపేట: కాసుల కక్కుర్తి కోసం డబుల్ బెడ్ రూం ఇళ్లను నాసిరకంగా నిర్మించారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి ఆరోపించారు. మండలంలోని లింగన్నపేటలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను శనివారం పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఇళ్లను పూర్తిగా లోపభూయిష్టంగా నిర్మించారని, పైకప్పుల పెచ్చులూడిపోతున్నాయని, కిటికీల అద్దాలు పగిలిపోయి ఉన్నాయని, నిర్మాణంలో ఇసుకనే ఎక్కువగా వాడారన్నారు. అధికారులు పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు దేవేందర్‌గౌడ్, కోడె రమేశ్, విగ్నేశ్ గౌడ్, బాలరాజు, నరసింహాచారి, తిరుపతి, విక్రాంత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీ హెల్త్ కేంద్రానికి ఫ్యాన్ల వితరణ


ఫ్యాన్లు అందిస్తున్న రజిత

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి స్థానిక ఉప సర్పంచ్ ఒగ్గు రజిత శనివారం తనవంతుగా ఫ్యాన్లు అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం ఇటీవల కమ్యూనిటీ హెల్త్ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేసింది. కార్యక్రమంలో వైద్యులు రఘు, ప్రదీప్, స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

'పంచాయతీ నిధుల వినియోగంపై అభ్యంతరం'


కార్యదర్శిని ప్రశ్నిస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్‌లో గ్రామ పంచాయతీ నిధులు పక్కదారి పడుతున్నాయని కాంగ్రెస్ నాయకులు మాదాసు అనిల్, కొమురయ్య పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. శనివారం జరిగిన గ్రామసభలో పలు బిల్లులపై అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేసేందుకు రూ.2.20 లక్షలు ఎలా డ్రా చేశారని ప్రశ్నించారు. జేసీబీ నడిచిన గంటల వినియోగంలో తేడాలు ఉన్నాయని ఆరోపించారు. అదనంగా సమయం నమోదు చేశారని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అనిల్ పేర్కొన్నాడు. ఇతర బిల్లుల చెల్లింపుల్లోనూ అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సౌజన్య మాట్లాడుతూ, రెండేళ్ల క్రితం జరిగిన పనులు పారదర్శకంగా జరిగాయన్నారు. ఏఈకి తాము బిల్లులు సమర్పించిన తర్వాతే చెల్లింపులు జరిగాయని, ఆడిట్ కూడా అయ్యిందని వివరించారు. నిబంధనల మేరకు పనులు జరిగాయని వివరించారు.

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి


మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

సిరిసిల్లఅర్బన్: ఉద్యోగ అభ్యర్థుల జీవితాలతో ఆడుకుంటున్న టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రెండోసారి గ్రూప్- 1 పరీక్ష రద్దయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ప్రశ్నపత్రాలను అమ్ముకోవడంతో, ఇప్పుడు మరోసారి పరీక్ష రద్దు చేయడం పట్ల ఎంతో మంది అభ్యర్థులు నష్టపోయారన్నారు. సమావేశంలో ఏబీవీపీ నాయకులు అభిలాష్, ప్రశాంత్, నాగరాజు, అరవింద్, నవీన్, సాయి, ప్రణయ్, రాజు, కార్తీక్ తదితరులు ఉన్నారు.

చిచ్చర పిడుగులు

సండే స్పెషల్

- కరాటేలో ప్రతిభ చాటుతున్న విద్యార్థులు
- ఆత్మ రక్షణతో పాటు.. అవార్డులు సొంతం
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ రాణింపు

సిరిసిల్ల అర్బన్: ఓవైపు చదువులో రాణిస్తూ, మరోవైపు ఆత్మరక్షణ విద్యలో ప్రతిభ కనబరుస్తున్నారు పట్టణానికి చెందిన పలువురు చిన్నారులు. కరాటే, కుంగ్ ఫూ, కిక్ బాక్సింగ్, వుషు తదితర వాటిలో రాణిస్తూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. తల్లిదండ్రులు ప్రోత్సాహంతో కరాటేలో ప్రతిభ చూపుతున్నారు. శిక్షకుల పర్యవేక్షణలో తర్ఫీదు పొందుతూ పతకాలు సాధిస్తున్నారు. అటు చదువుతోపాటు ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేస్తూ పోటీలకు సిద్ధమవుతున్నారు. పంచ్‌లు, కటాస్, ఈజీ స్ట్రెచ్చింగ్, కిక్స్, తలవార్, నాన్‌చాక్, డబుల్ నాన్ చాక్, నైఫ్, సెల్ఫ్ డిఫెన్స్, పలు విన్యాసాలు ప్రదర్శిస్తూ ఔరా అనిపిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై ప్రతిభ కనబరిస్తూ అందిరి మన్ననలు పొందుతూ అవార్డులు సొంతం చేసుకుంటున్నారు.


కరాటే శిక్షణ పొందుతున్న చిన్నారులు, మహిళలు

మరిన్ని పతకాలు సాధిస్తా



నేను నెహ్రూనగర్‌లోని ఎంపీపీఎస్ పాఠశాలలో చదువుతున్నాను. మూడేళ్లుగా కరాటేలో శిక్షణ పొందుతున్నాను. అంతర్జాతీయ స్థాయిలో, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించా. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎనిమిది బంగారు, వెండి పతకాలు అందుకున్నా. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధిస్తా.
– అదిబ ఫిరోదిస్, సిరిసిల్ల

రెండేళ్లుగా శిక్షణ



నేను ఐదో తరగతి చదువుతున్నా. రెండేళ్ల నుంచి కరాటేలో శిక్షణ పొందుతున్నా. ఇప్పటి వరకు 6 బంగారు, వెండి పతకాలను గెలుచుకున్నా. ప్రస్తుతం ఎల్లో బెల్ట్‌ను సాధించాను. హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయిలో పోటీలో బంగారు పతకాన్ని సాధించా. బ్లాక్ బెల్ట్ సాధించేందుకు కృషిచేస్తున్నా.
– నల్ల ప్రణవ్, సిరిసిల్ల

ఆత్మరక్షణ కోసం



నాలుగేళ్ల నుంచి కరాటే నేర్చుకుంటున్నా. ఉదయం సాయంత్రం శిక్షణకు వెళ్తాను. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఇప్పటివరకు 16 బంగారు, వెండి, అవార్డులు గెలుచుకున్నాను. జాతీ య, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు సిద్ధమవుతున్నా. ఆడపిల్లలు కరాటే లాంటి ఆత్మరక్షణ విద్య నేర్చుకోవాలి. – జోయా అనమ్

చిన్నారుల ఆసక్తి



ప్రస్తుతం కరాటే లాంటి ఆత్మరక్షణ విద్య నేర్చుకునేందుకు పిల్లలు ఆసక్తి కనబరుస్తున్నారు. బాలురతో పాటు బాలికలు శిక్షణ పొందుతున్నారు. పలు ప్రభుత్వ పాఠశాలలతో పాటు, మినీ స్టేడియంలో విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నా. శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటి పతకాలు సాధించారు. – జవేరియా బేగం, గోజిరాయ్, కరాటే ఇన్‌స్ట్రక్టర్

గిరిజన కళాశాల విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ సంక్షేమ కళాశాల విద్యార్థినులు జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రజిని మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థులు ఐదు గోల్డ్, ఏడు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. అండర్-20లో 800, 400మీటర్లు ఆర్.సంధ్య గోల్డ్, షాట్‌పుట్ జి.అర్చన గోల్డ్, లాంగ్‌జంప్‌లో పార్వతి గోల్డ్, 100 మీటర్లు ఏ.శివాణి గోల్డ్, 100 మీటర్లు కె.భవాని సిల్వర్, 400మీటర్లు పార్వతి సిల్వర్, లాంగ్‌జంప్ బి.అంజలి సిల్వర్, 400 మీటర్లు షాట్‌పుట్ ఎం.అర్చన సిల్వర్ పతకం సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు మేలు


మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో శనివారం సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం కేకే మాట్లాడారు. ప్రజలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని.. రాబోయేది కాంగ్రెస్ సర్కారే అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఆసాని మహిపాల్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ టోని, నాయకులు లింగాల భూపతి, హరికరెడ్డి, పరుశురాం, భాగ్య, సంగీత, సరిత, తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన

సిరిసిల్లకల్చరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించిన సంఘం శరణం గచ్ఛామి నాటకాన్ని ఆదివారం మధ్యాహ్నం ప్రదర్శిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. నర్సింగ్ కళాశాల పక్కన గల అంబేడ్కర్ భవన్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. అలాగే వేములవాడ పట్టణ పరిధిలోని బింగి మధు ఫంక్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు ప్రదర్శిస్తామన్నారు. అంబేడ్కర్ అభిమానులు, దళిత సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు ప్రదర్శన తిలకించి జయప్రదం చేయాలని కోరారు.

ఎల్‌డీసీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న అంగన్‌వాడీలు

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐసీడీఎస్ ఉద్యోగిపై చట్టపర చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీలు శనివారం సిరిసిల్ల ఠాణా మెట్లెక్కారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, సిరిసిల్ల ఐసీడీఎస్‌లో ఎల్‌డీసీగా పనిచేస్తున్న మహేందర్ తాము ఆర్డీవో ఆఫీసు ముందు చేపడుతున్న నిరవధిక సమ్మె శిబిరం వద్ద తమపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. అసభ్య పదజాలం వాడి అవమాన పరిచిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. జేఏసీ ప్రతినిధులు కల్లూరి చందన, ఎదురుగట్ల మమత, కొండికొప్పుల పద్మ, ఓరగంటి శ్యామల, పద్మ, అంజలి, వాణి, రమ, మంగ తదితరులున్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తా


మోహన్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: రైతులకు అందుబాటులో ఉండి వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్ అన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లిలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గౌడ సంఘం సభ్యులు శనివారం నూతనంగా రాచర్లబొప్పాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ పాశం సరోజన, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, గౌడ సంఘం సభ్యులు పందిర్ల సుధాకర్‌గౌడ్, తీగల ప్రకాశ్‌గౌడ్, గణపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు అందే సుభాష్, నర్సింహరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేసేవరకు ఉద్యమం


ముస్తాబాద్‌లో దీక్ష చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల వనరుల కేంద్రం ఎదుట మధ్యాహ్న భోజన వంట కార్మికులు శనివారం దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే వేతనాలు పెంచాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నెలకు రూ.3వేల వేతనాలు అందజేయాలన్నారు. తమ పెండింగ్ బిల్లులు విడుదల చేసే వరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు. గొట్టె సంతోష, దేవలక్ష్మి, నర్సవ్వ, వెంకటవ్వ, శారద, లక్ష్మి, రేణుక, దేవవ్వ, భారతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉద్యోగాల భర్తీలో విఫలం

కోనరావుపేట: రాష్ట్రంలో ఉద్యోగాలు భర్తీ చేయడంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మున్నూరుకాపు విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేల్పుల మహిపాల్ అన్నారు. గ్రూప్-1 సర్వీస్ పరీక్ష మరోసారి రద్దు కావడంతోఅభ్యర్థులు నష్టపోయారని పేర్కొన్నారు.

ఆపరేటర్ల సమ్మె నోటీసు

ఇల్లంతకుంట: మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లు తమ సమస్యలు పరిష్కారం కోసం శనివారం డీపీఓ రవీందర్, ఎంపీడీఓ మీర్జాకు సమ్మె నోటీసు ఇచ్చారు.

మాట్లాడే అర్హత లేదు

ఇల్లంతకుంట: మానకొండూర్ నియోజకవర్గంలో కొత్త బిచ్చగాళ్లు ఎవరో ప్రజలకు తెలుసని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ అన్నారు. స్థానికేతర ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు కాంగ్రెస్ గ్యారెంటీకార్డుపై మాట్లాడే అర్హత లేదని, ఆయన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు.

'చల్మెడ'కు సన్మానం

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ పాఠశాల అభివృద్ధికి సహకారం అందించిన చల్మెడ లక్ష్మీనర్సింహారావును పూర్వ విద్యార్థి అసోసియేషన్ (పీవీపీ) అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ గోగూరి మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వీర్నపల్లి: మండలంలోని భూక్య తండాలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు బాధావత్ రవి ఆధ్వర్యంలో భూక్య బికికి రూ.14 వేల విలువైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ చేశారు. సర్పంచ్ గుగులోత్ భారతి తదితరులు పాల్గొన్నారు.

లో లెవల్ వంతెనలు బాగు చేయాలి

బోయినపల్లి: మండలంలో శిథిలమైన లో లెవల్ వంతెనలను హై లెవల్ బ్రిడ్జీలుగా నిర్మించాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన కల్వర్టు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం

వీర్నపల్లి: మండలంలోని మద్దిమల్లలో శనివారం కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు బోగు తిరుపతియాదవ్ ఆధ్వర్యంలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

పరేడ్‌తో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం

ఇల్లంతకుంట: పరేడ్‌తో క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం లభిస్తుందని ఎస్సై డి.సుధాకర్ అన్నారు. పోలీస్‌శాఖలో వీక్లీ పరేడ్‌లో భాగంగా శనివారం ఉదయం స్టేషన్ ఆవరణలో పరేడ్ నిర్వహించినట్లు తెలిపారు.

వైద్య శిబిరం

తంగళ్లపల్లి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గోపాల్‌రావుపల్లె గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ ఎంఎల్‌ఎన్ రెడ్డి వైద్య బృందం 101 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

తండాల్లో పోషణమాసం

రుద్రంగి: మండలంలోని చింతామణి తండా, జోత్యతండాలో శనివారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

మొక్కలు నాటిన యూట్యూబ్ కళాకారులు

బోయినపల్లి: రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌కు మద్దతుగా కొదురుపాకలో శనివారం కళాకారుడు కత్తెర పాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో యూ ట్యూబ్ కళాకారులు మొక్కలు నాటారు. డైరెక్టర్ శ్రీను, నటి వర్షిణి, కెమెరామెన్ వేణు తదితరులు పాల్గొన్నారు.

శుభకర వినాయక


చందుర్తి: మల్యాలలో కుంకుమపూజ

సిరిసిల్లటౌన్/వేములవాడ/చందుర్తి/వేములవాడరూరల్/ఎల్లారెడ్డిపేట/రుద్రంగి/కోనరావుపేట/ముస్తాబాద్: జిల్లావ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పద్మశాలీ మహాత్మా ఐక్యసంఘం తదితర మంటపాల్లో టౌన్ సీఐ ఉపేందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, సెస్ డైరెక్టర్ దిడ్డి మాధవి తదితరులు పూజలు చేశారు. వేములవాడ పట్టణంలోని పలు మంటపాలు, చందుర్తి మండలం మర్రిగడ్డ, మల్యాల, కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి అన్నదానం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చందుర్తిమండలం నర్సింగపూర్, మల్యాల, చందుర్తి గ్రామాల్లోని మండపాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలో కుంకుమ పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. రుద్రంగి మండల కేంద్రంలో గల్లీ గణేశ్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో వినాయక మంటపాల వద్ద చల్మెడ లక్ష్మీనర్సింహారావు పూజలు చేశారు.

దళితబంధు అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం


సమావేశంలో నాయకులు

సిరిసిల్లటౌన్: దళితబంధు అమలులో రాష్ట్ర సర్కారు అంతులేని నిర్లక్ష్యం వహిస్తుందని అఖిలపక్షం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సిరిసిల్ల సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. దళితబంధు పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా హుజురాబాద్‌లో కొన్ని కుటుంబాలకు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారికే ఇస్తున్నారని ఆరోపించారు. అర్హులైన దళితులకు ఇవ్వకుంటే సహించబోమని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, నాయకులు అంకనిభాను, ఎరవెల్లి నాగరాజు, ఖానాపురం లక్ష్మన్, సోమిశెట్టి దశరథం, గోనె ఎల్లప్ప, కంసాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పరాధీనంలో మున్సిపల్ స్థలం..?


మున్సిపల్ స్థలంలో ప్రైవేటు వ్యక్తుల వాహనాలు

సిరిసిల్లటౌన్: మున్సిపల్ స్థలం పరాధీనంలో ఉండటం స్థానికంగా వివాదానికి దారి తీసింది. సిరిసిల్ల పట్టణం రాళ్లబావి సమీపంలో గల మున్సిపల్ స్థలాన్ని కాపాడే విధంగా ఇలా కంపౌండ్ నిర్మించారు. కాగా ఆప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి ఇలా కార్లను పార్కింగ్‌కు వినియోగిస్తున్నారని స్థానికులు తెలిపారు. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో మున్సిపల్ స్థలం ఉండకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.

మద్యం అమ్ముతూ నిరసన


నిరసన తెలుపుతున్న దశరథం

సిరిసిల్లటౌన్: కూరగాయల బండిపై లిక్కర్ అమ్ముతున్న ఇతను మొబైల్ బార్ నిర్వాహకుడు అనుకుంటే మీరు తప్పులో కాలేసినట్లే. సిరిసిల్లకు చెందిన ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం. రెండుసార్లు కేసీఆర్‌కు అధికారం ఇస్తే.. తన లిక్కర్ పాలసీతో తాగుబోతుల రాష్ట్రంగా మార్చాడని ఆరోపించారు. మరోసారి అధికారమిస్తే.. సామాజిక పింఛన్లలో వితంతువుల సంఖ్య పెంచడం ఖాయమని విమర్శించారు. కూరగాయలతోపాటు బీరు, బ్రాండి, విస్కీ, చీప్‌లిక్కర్ అమ్ముతూ.. కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరుతూ.. ఇలా వినూత్నంగా నిరసన తెలిపారు.

కోతుల దాడిలో వరిపంట ధ్వంసం


దెబ్బతిన్న వరిపంట

ముస్తాబాద్: ముస్తాబాద్ శివారులోని రైతు శాడ మహేశ్‌కు చెందిన నాలుగెకరాల వరిపంటను కోతులు ధ్వంసం చేశాయి. ఈనే దశలో ఉన్న వరిని నాశనం చేశాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కోతుల బెడదతో ఇప్పటికే కూరగాయల సాగు మానుకున్నామని, ఇప్పుడు వరిని కూడా దక్కనివ్వడం లేదని వాపోయాడు. పంచాయతీ అధికారులు కోతుల బెడద నుంచి రైతులను రక్షించాలని వేడుకున్నాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి శివారు మూలవాగునుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న జవ్వాజి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ చేనేత సెల్ పట్టణాధ్యక్షుడిగా బాలరాజు

సిరిసిల్లఅర్బన్: చేనేత సెల్ కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడిగా గుడిసెట్టి బాలరాజును నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గోనే ఎల్లప్ప ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, అన్నల్‌దాస్ భాను తదితరులు ఉన్నారు.


తప్పిన బాండ్‌పేపర్ల బాధలు

సిరిసిల్లఎడ్యుకేషన్: ఒప్పంద పత్రాలు రాసేందుకు వినియోగించే బాండ్‌పేపర్ల అమ్మకానికి ఎలాంటి ఆంక్షలు లేవని సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్ పార్థసారధి శనివారం తెలిపారు. బాండ్‌పేపర్ల అమ్మకాన్ని ప్రభుత్వం ఆన్‌లైన్ చేసిందని, ఇన్నాళ్లు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే అమ్మకాలు చేయడానికి స్టాంప్ వెండర్స్ అవకాశం కల్పించినట్లు వివరించారు. ఆ నిబంధనలను సవరించి రోజులో ఏ సమయంలోనైనా, సెలవు దినాల్లోనూ బాండ్‌పేపర్స్ అమ్మకాలు చేయవచ్చని, కానీ ఆన్‌లైన్ నమోదు చేయడం తప్పనిసరి అని తెలిపారు.

నిధుల మంజూరుకు కృషి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి ఆయకట్టు రోడ్డులో ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన కాజ్‌వే పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తామని పంచాయతీరాజ్ ఈఈ సూర్యనారాయణ, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు తెలిపారు. శనివారం కాజ్‌వేను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వానికి నివేదిక సమర్పించి నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్నారు. ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ పాశం సరోజన, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొండ రమేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


అభినందిస్తున్న జెడ్పీటీసీ మీనయ్య తదితరులు

రుద్రంగి: ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి జోన్ పోటీలకు ఎంపికైన రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులను పీఈటీని జెడ్పీటీసీ గట్ల మీనయ్య, హెచ్‌ఎం అంబటి శంకర్ అభినందించారు. అలాగే వనపర్తి హాకీ అకాడమీకి ఎంపికైన విద్యార్థులు దయ్యాల విజయ్‌కుమార్, అనుముల సంతోష్‌ను జెడ్పీటీసీ, సెస్ డైరెక్టర్ గంగారాం అభినందించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కంటి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.